ISSN 2582-2411
₹25/-

దర్శనమ్®

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

జూలై -2024



సనాతనధర్మం ప్రభవించిన పర్వదినం

వ్యాసపౌర్ణమి



నారాయణావతారం.. స్వామి వివేకానందుడు

గురుపూర్ణిమ నాడు సద్గురువులను పూజించటం భారతీయ సంస్కృతి. మహర్షి వ్యాసభగవానుడితో ప్రారంభమైన గురుపరంపర కడు సుదీర్ఘమైంది. ఈ గురు-శిష్య పరంపరలో విశ్వవిఖ్యాతి గాంచిన వారు బహుకొద్ది మంది. వారిలో 19వ శతాబ్దంలో ప్రముఖంగా నిలిచేవారు శ్రీ రామకృష్ణ పరమహంస- వివేకానందులు.



కొప్పరపు నారాయణమూర్తి

ఇదేదో కొత్త ప్రయోగం కాదు. స్వామి వివేకానందుల వారే స్వయంగా తన ఉపన్యాసాలలో తత్వ విషయాలకు సంబంధించిన సమస్యలకు సమాధానంగా - 'ఇందుకు మా శ్రీ రామకృష్ణ-వివేకానందుల సమాధానం ఏమిటంటే'-- అంటూ జవాబు చెప్పేవారు. తొలిసారి కాళీమాత దర్శనం అయినప్పటి నుంచి స్వామిజీకి ఒక సందేహం ఉండేది. అదేమిటంటే, శ్రీ రామకృష్ణులు అమ్మవారి మందిరం బయట నిల్చుని తనను లోపలికి వెళ్లి అమ్మ దర్శనం చేసుకోమన్నప్పుడల్లా, అమ్మ కాళీ - శ్రీ రామకృష్ణులు వేరు వేరుకారనే భావన స్వామి వివేకానందకు కలుగుతుండటం. ఎందుకంటే లోపల తనకు, అమ్మకాళీకి జరిగిన చర్చంతా శ్రీ రామకృష్ణులు విన్నట్టే కనిపించేవారు. తను బయటికి రాగానే ముసిముసి నవ్వులు నవ్వుతూ, 'అమ్మ ఏమంది? నీ ప్రశ్నలకు సమాధానం చెప్పిందా?' అని అడిగేవారు. చివరకు తనకూ ఆత్మ సాక్షాత్కారం అయినాక తెలిసింది స్వామి వివేకానందకు --యోగులంతా ఏకాత్మ భావనతో ఉంటారని. అలా ఆయన తనకు, శ్రీ రామకృష్ణులకు మధ్య కూడా భేదం లేదని స్వీయ అనుభవంతో గ్రహించాడు.

ఇక శ్రీ రామకృష్ణులవారు స్వామి వివేకానందుని 'నారాయణావతారం'గా పేర్కొనే వారు. శ్రీ రామకృష్ణుల సతీమణి ధర్మపత్ని శ్రీ శారదాదేవి కూడా రామకృష్ణుల శిష్యులకు 'స్వామి వివేకానంద 'నారాయణావతారం' అని చెప్పేది. సప్త ఋషి మండలంలో తపస్సు ఆచరిస్తున్న ఋషుల్లో స్వామి వివేకానంద ఒకరని శ్రీ రామకృష్ణులు స్వయంగా తన శిష్యులకు చెప్పేవారు. అటువంటి మహర్షి స్వామి వివేకానందుడు. ఈ గురుపూర్ణమి సందర్భంగా స్వామి వివేకానందుని, ఆయన గురుదేవులైన శ్రీ రామకృష్ణులను, వారిరువురి మధ్య సంబంధాలను స్మరించటం మనకు గురుపూజతో సమానం, అత్యంత శుభదాయకం.

స్వామి వివేకానంద జనవరి 12, 1863న జన్మించారు. వేయి సంవత్స రాలు జీవించినా ఎవ్వరూ చేయలేనంత వేదాంత యజ్ఞ్యాన్ని, వేద సాహిత్యాన్ని సృజించి,వాటిని అధునాతన శాస్త్ర విజ్ఞ్యాన ఆధారంగా విపులీకరించి, ముప్పయి తొమ్మిది సంవత్సరాలకే జులై 4, 1902న కాలం చేశారు. అంటే నేటికీ సుమారు 122 సంవత్సరాలక్రితం ఈ మహర్షి దివినుండి భువికి దిగివచ్చి, తిరిగి దివికెగసిన అవతారం.అది శంకరులు కూడా కేవలం 32 సంవత్సరాలు మాత్రమే జీవించారు. కానీ , వారు ఈ స్వల్ప కాలవ్యవధిలో సృజించిన తత్వ శాస్త్రం, జరిపిన పర్యటనలు - 'న భూతో న భవిష్యత్' లాంటివి.వివేకానందులు కూడా భారత దేశం అంతా పాదాలపై తిరిగారు. ఆ రోజుల్లో ఆయన 'పేరు లేని' సన్యాసి గానే పర్యటించారు. ఆయన చివరగా దర్శించిన ఖేత్రీ మహారాజు వారికి 'స్వామి'వివేకానంద' అని నామం ఒసగారు.

పేరులేని సన్యాసిగా స్వామి భారతదేశం పర్యటించేప్పుడు జరిగిన అనేక ఘటనలు మనల్ని ఆశ్చర్య పరుస్తాయి. స్వామిజిది ఆజానుబాహుడిని పోలిన మంచి బలిష్టమైన శరీరం. గుండ్రటి కళ్ళు, విశాలమైన నుదురు. విరుచుకొని ఉన్నట్లుండేఛాతి. అటువంటి స్వామిజ భారత దేశ పర్యటనప్పుడు సరైన భోజనం, వసతి, నిద్ర, విశ్రాన్తి లేక



నీరసించి పోయేవారు. స్వామిజి ఆ రోజుల్లో దారిన కట్టిన సత్రాలలో ఉండేవారు. మామూలు బిక్షాటన చేసే సాధువులతో తనూ బిక్షాటన చేసి లభించిన దానిని స్వీకరించి తన పొట్ట నింపుకొనేవారు. ఒక్కోసారి భిక్ష దొరక్కపోతే రోజుల తరబడి ఉపవాసం ఉండేవారు. అయినా తన ప్రయాణం కొనసాగించే వారు. ఈ కాలంలో అనేక సార్లు ఆయన రోడ్డుమీద స్పృహ తప్పి పడిపోయిన సందర్భాలున్నాయి. ఆ సమయంలో ఆయన పట్లఎవరైనా జాలి చూపి, నీళ్లు జల్లి మంచి నీరు, అంత తినేందుకుఏదైనా పెడితే దానిని గుర్తుపెట్టుకొని వారు. ఒకసారి స్వామి ఒడిస్సా రాష్ట్రంలో . ఒక ఊర్లో పర్యటిస్తూ ఆహారం లేకపోవటం వలన నీరసించి ఒక గృహస్తు ఇంటి ముందు పడిపోయారు. ఆ గృహస్తు వెంటనే వారిమీద నిరుజల్లి లేపి, తన ఇంటిలోనికి కొనిపోయి కొంత ఆహారం పెట్టి, తదుపరి ప్రయాణానికి ఆహారంగా ఒక పుచ్చకాయనిచ్చి వీడ్కోలు పలికారు.

ఆ తరువాత కొన్నేళ్ళకు స్వామిజీ అమెరికా వెళ్ళటం, అక్కడ చికాగో పార్లమెంట్ అఫ్ రెలిజియన్స్ (చికాగో సర్వ మత సమ్మేళనం) లో పాల్గొని ప్రపంచ ఖ్యాతిపొందటంజరిగాయి. అమెరికానుంచి తిరిగి భారత దేశం వచ్చాక స్వామిజి తిరిగి భారత పర్యటన చేశారు. దీనిని 'కొలాంబో టు అల్మోరా' గా అచ్చువేశారు శ్రీ రామకృష్ణా మఠం వారు. ఈ పర్యటనలో స్వామీజి ఒడిస్సా రాష్ట్రంలో తను ఏ ఊర్లోఎవరింటి ముందు పడిపోయారో ఆ ఇంటికే తిరిగి వెళ్లి ఆ యజమానిని పిలిచి నాడు ఆయన చేసిన సహాయానికి కృతజ్ఞతగా అతనికి కొంత డబ్బు, బట్టలు ఇచ్చారు. వారి జ్ఞాపకశక్తికి, ధర్మ నిరతికి ఆనాడు ఆ ఊర్లో ప్రజలు ఆనందంతో కళ్ళు చెమర్చారు.

ఇలాంటిదే మరో ఘటన. ఒక సారి స్వామిజి (అప్పటికి ఇంకా వివేకానంద అనే పేరు లేదు) రైలులో ప్రయాణిస్తున్నాడు. అప్పటికి మూడు రోజులైంది స్వామికి భోజనం లేక. స్వామి నీరసమువలన నిద్రలోకి జారుకున్నారు. తెల్లవారితే రైలు నాగపూర్ చేరుతుంది. నాగపూర్ లో ఒక పేరున్న మిఠాయి షాపు యజమాని గాఢ నిద్రలో ఉన్నారు. హఠాత్తుగా శ్రీ రామకృష్ణులు వారికి కలలో కనిపించి 'ఒక ఊరు పేరు లేని స్వామిజి రైలులో నాగపూర్ కు వస్తున్నారు. ఆ స్వామిజిఆహరం తినక మూడు రోజులై, బాగా నీరసించి ఉన్నారు. నువ్వు వెళ్లి ఆ స్వామీజీకి మిఠాయిలు తినిపించి రా. "నరేన్' అని ఎవరైనా ఈ రైలు పెట్టెలో ఉన్నారా?"అని బిగ్గరగా అరు. అప్పుడు ఆ స్వామిజి లేచి తానే 'నరేన్' అని చెబుతాడు. అతనికి మిఠాయిలు ఇచ్చి శ్రీ రామకృష్ణులు వారు పంపారు అని చెప్పు' అని చెప్పి అంతర్ధానమయ్యాడు కలలో. ఈ కలతో మెలుకువ వచ్చిన ఆ



మిఠాయి వ్యాపారి 'ఇది కలా? కల నిజమేలా అవుతుంది?' అని తర్కించుకొని మళ్ళీ నిద్రకుపక్రమించాడు. కాసేపటికి తిరిగి శ్రీ రామకృష్ణులు మళ్ళీ అతని కలలో కనిపించి 'ఓ వ్యాపారి, విను. నీకు కలలో కనిపించింది నిజమే. తక్షణమే నువ్వు నాగపూర్ రైల్వే స్టేషన్కు వెళ్లు' అని చెప్పి అంతర్ధానం అయినాడు. ఇలా మళ్లీ మళ్లీ కనిపించడంతో ఆ మిఠాయి వ్యాపారికి ఏమి చేయాలో తోచక, ఎందుకైనా మంచిదని భావించి, కొన్ని మిఠాయిలను తీసుకొని రైల్వే స్టేషన్కు వెళ్ళాడు.

కలలో కనిపించిన సాధువు చెప్పిన రైలు అప్పుడే ప్లాటుఫారం పైకి వచ్చింది. వెంటనే అ వ్యాపారి 'ఇక్కడ నరేన్ అనే సాధువు, లేక సన్యాసి ఎవరైనా ఉన్నారా?' అంటూ పెట్టె పెట్టెకు అరవడం మొదలు పెట్టాడు. నరేన్ ఉన్న పెట్టెలో తోటి ప్రయాణీకులు అతనిని మూడు రోజులనుంచి గమనిస్తున్నారు. అతను అన్నము, నీరు లేకుండా బాగా నీరసించి మూడు రోజులనుంచి అలానే రైలులో పడి ఉండటం వారికి తెలియదు. బహుశ ఆ వచ్చినాయన అతని గురించే అడుగుతున్నాడని భావించి, కాసిని నీళ్లు ఆతని ముఖం పై జల్లి నరేన్ను లేపారు. తనపేరు ఒకప్పుడు నరేన్ అన్న సంగతి మరిచిపోయిన నరేన్, ఎలాగో గుర్తు చేసుకొని 'ఆ , అవును.ఈ దేహాన్నే నరేన్ అని

పిలుస్తారు' అంటూ నీరసంగా పలికాడు. అంతట ఆ వ్యాపారి శ్రీ రామకృష్ణులు తనతో ఇలా మిఠాయిలు తీసుకెళ్లమని పురమాయించటం గురించి చెప్పి ఆ మిఠాయిలను స్వామిజీకి అందించాడు. శ్రీ రామకృష్ణులు అవతారం చాలించాక గూడా తన శిష్యుడిని వెంటనే ఉండేవారు అనటానికి ఇదొక సాక్ష్యం.



శ్రీ రామకృష్ణులు భౌతిక శరీరం విడిచాక కూడా అప్రమత్తమై ఉండేవారు. నిరంతరం తనభక్తులను, వివేకానందుడి వంటి శిష్య రత్నాలను కాపాడుకొనే వారు. ఒకేసారి ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న స్వామి వివేకానందుడు ఒకానొక సత్రంలో రాత్రి బస చేయటం జరిగింది. అక్కడ స్వామిజి లాంటి సాధువులు మరికొందరు ఉన్నారు. వారూ ఆ రాత్రికి అక్కడ విడిది చేసేవారే . తెల్లవారితే వెళ్ళిపోతారు. మాటల సందర్భంగా స్వామి వివేకానందుడి, అక్కడున్న ఒక తాంత్రిక సాధకుడికి వివాదం జరిగింది. ఆ వాదంలో స్వామిజి ఆ సాధువునుతుత్తునియలుగా పరాజితుడిని చేశారు. ఆ వాదం విన్న మిగతా సాధువులు స్వామి వివేకానంద పక్షం వహించారు. అది గమనించి ఈర్ష్య, అవమానం పాలైన సాధువు తన తంత్ర శాస్త్ర శక్తిని స్వామి పై ప్రయోగించాడు. ఫలితంగా ఆ రాత్రి స్వామి వివేకానందకు విపరీతమైన కడుపు నొప్పి వచ్చింది. మెలికలు తిప్పే పేగు నొప్పి. స్వామి వివేకానందుడు బలిష్టమైన వాడు కాకపోతే, ఆ బాధ కు 'హరీ' అనే వాడు. అంత దుర్భర బాధది. నిష్కారణంగా తనను అటువంటి బాధకు గురిచేసిన సాధువు పై స్వామీజీకి తీవ్ర ఆగ్రహం వచ్చింది. ప్రతి శాపం ఇవ్వాలనుకున్నాడు.

కానీ , సరిగ్గా అదే సమయానికి శ్రీ రామకృకిష్ణ గురుదేవులు ప్రత్యక్షమై స్వామీజీని ప్రతి శాపం ఇవ్వకుండా నిరోధించాడు. ఈ కారణంగా స్వామి వివేకానందకు, శ్రీ రామకృష్ణులకు తీవ్ర వాదోపవాదాలు జరిగాయి. శ్రీ రామకృష్ణులు చివరగా ఇలా చెప్పారు. 'నేను భూమిపై అవతరించేందుకు వచ్చేటప్పుడు సప్తఋషిమండలంపైనుంచివస్తూ, నిన్ను నాకు తోడుగా రమ్మని ఆహ్వానించాను. భూలోక మాయలో పడకుండా నిన్ను సురక్షితంగా సప్త ఋషిమండలంలో చేర్చే బాధ్యత నేను తీసుకొన్నాను. ఇప్పుడు నీవు అతనికి ప్రతిశాపం ఇస్తే, నువ్వు భూలోక మాయలోపడినవాడివవుతావు. అంటే, నీకు పునర్జన్మకు ఆస్కారం కలిగించినవాడివవుతావు. నిన్ను క్షేమంగా సప్తఋషి మండలం చేర్చే బాధ్యత నాపై ఉన్నందున నేను నిన్ను ప్రతిశాపంఇయ్యవద్దని నిరోధిస్తున్నాను. ఇక ఆ పై నీ ఇష్టం' అని చెప్పడంతో స్వామి వివేకానందుడు శాంతించి ఈ ప్రాణం తీసే నొప్పినుంచి ఊరట కలిగించమని వేడుకొంటాడు. అందుకు, శ్రీ రామకృష్ణులు 'నొప్పి తీవ్రత తగ్గుతుంది. కానీ, ఈ నొప్పి తాంత్రిక శక్తి ప్రయోగం వలన వచ్చింది కాబట్టి మూడు దినములు నువ్వు దానిని అనుభవించక తప్పదు ' అని చెప్పి అంతర్ధానమవుతాడు.

'ఇలా నా గురువు నన్ను అనుక్షణం కాపాడుతూనే వచ్చాడు' అంటూగురుదేవునిస్మరణకు నివాళిగా తన ఉపన్యాసం ఒకటి ముగిస్తాడు స్వామి వివేకానంద. భారతీయ ఋషిపరంపర లో గురు శిష్య సంబంధాలపై ప్రసంగించిన స్వామీజీ, గురువుకు శిష్యుడిపైన ఉండే అవ్యాజమైన ప్రేమ, శిష్యుడికి గురువు పట్ల ఉండవలసిన అచంచల భక్తి గురించి వివరించాడు. ఈ ప్రపంచంలోని మేధావులంతా ఏకమైనా తన గురువు శ్రీ రామకృష్ణులజ్ఞ్యానం ముందు నిలువలేరని హార్వర్డ్ ఉప న్యాసాలలో గురువు శ్రీ రామకృష్ణ గురుదేవులను శ్లాఘిస్తాడు స్వామి వివేకానందులు. నిజానికి శ్రీ రామకృష్ణలకు తనపేరు సంతకం రూపంలో పెట్టేంత మాత్రం చదువుతప్ప హార్వర్డ్ మేధావుల చదువు, డిగ్రీలు ఏమీలేవు. అయినా ఆయన ముందు ప్రపంచ మేధావులంతా దిగదుడుపే అని నొక్కి వక్కాణిస్తాడు స్వామి వివేకానంద. శ్రీ రామకృష్ణుల వంటి గురుదేవులు ఇంకా చాలా మంది ఉండి ఉండవచ్చు. కానీ , స్వామి వివేకానందుడు వంటి శిష్యుడు 'న భూతో న భవిష్యత్'. ఆ విధమైన ఉపనిషద్ ప్రమాణ స్ఫూర్తిగా నిలిచిన ఋషిపరంపర లోని ఏకైక శిష్యుడు, కట్ట కడపటి వాడు స్వామి వివేకానందుడే. ■